WANTED

జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ /మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
9492580091

Facebook.varadhinews

విశ్వ

# వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి:1
సంచిక:28
మంగళవారం,
01.10.2024

# అధికారులు చెబితే..
# హైకోర్టును కూలుస్తారా..?

## మిస్టర్ రంగనాథ్ రూల్స్ ఫాలో అవ్వండి

- శని, ఆదివారాల్లోనే ఎందుకు కూలుస్తున్నారు
- ఆదివారం కూల్చొద్దన్న నిబంధన తెలియదా..?
- అధికారులు అనుమతిస్తేనే కదా ఇళ్లు నిర్మించింది
- అధికారుల లోపం వల్ల ప్రజలు ఇబ్బంది పడాలా..?
- చట్టప్రకారం నడుచుకోకుంటే ఇబ్బందులు పడతారు
- అవసరమైతే హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే ఇస్తాం
- హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు హైకోర్టు చివాట్లు
- తదుపరి విచారణ అక్టోబర్ 15కు వాయిదా



### అధికారులు తప్పు చేస్తే ప్రజలు నష్టపోవాలా..?

సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేస్తేనే సామాన్యులు ఇళ్లు నిర్మిస్తున్నారు కదా.. స్థానిక సంస్థ అనుమతి ఇస్తేనే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నార కదా.. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో సామాన్యులు నష్టపోవాల్సి వస్తోందని స్పష్టం చేసింది. ఆదివారం కూల్చివేతలు వద్దని త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఉందని, ఒకవేళ అక్రమం అనిపిస్తే సీజ్ చేయవచ్చు కదా? అని న్యాయమూర్తి పేర్కొన్నారు. హైడ్రా ఏర్పాటు అభినందనీయమే కానీ, పనితీరే అభ్యంతరకరం అని అన్నారు. అమీన్‌పూర్ తహసీల్దార్, హైడ్రా కమిషనర్ తీరు అసంతృప్తికరం అని తెలిపారు. ఒక్కరోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదన్న న్యాయస్థానం... ఎఫ్‌టీఎల్ నిర్ధారించకుండా అక్రమాలు అని ఎలా తేలుస్తారు?' అని ప్రశ్నించింది. తదుపరి విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేస్తూ అప్పటివరకు యథాస్థితి కొనసాగించాలని హైడ్రా, అమీన్‌పూర్ తహసీల్దార్‌ను ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయాలని సూచించింది.

**వారధి, స్టేట్ బ్యూరో:**

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ హైదరాబాద్ నగరంలో హైడ్రా హడలెత్తిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు హైడ్రాపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నిర్మాణాల కూల్చివేతలు శని, ఆదివారాల్లో ఎందుకు చేపడుతున్నారని హైడ్రాపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో కూల్చివేతలపై సోమవారం జరిగిన విచారణకు హైడ్రా కమిషనర్ రంగానథ్ వర్చువల్‌గా హాజరు కాగా, అమీన్‌పూర్ తహసీల్దార్ నేరుగా కోర్టుకు హాజరై వివరణ ఇచ్చారు. భవనాలు, ఇతర నిర్మాణాల కూల్చివేతలు శని, ఆదివారాలు, సూర్యాస్తమయం వేళల్లోనే ఎందుకు చేపడుతున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదివారం మీరు ఎందుకు పని చేయాలని ప్రశ్నించిన న్యాయమూర్తి సెలవుల్లో ఎందుకు నోటీసులు ఇచ్చి, అత్యవసరంగా కూల్చివేస్తున్నారని ప్రశ్నించారు. శని, ఆదివారాల్లో కూల్చివేయొద్దని గతంలో కోర్టు తీర్పులున్నాయని గుర్తు చేస్తూ కోర్టు తీర్పుల విషయం కూడా తెలియదా అని తహసీల్దార్‌ను ప్రశ్నించింది. గతంలో మీరు కూల్చివేసిన కేసుపై స్టే విధించిన విషయం తెలియదా? అని అడుగుతూ చట్టప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించింది.

చార్మినార్‌ను కూల్చమంటే కూలుస్తారా..?

రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు చెప్పినంత మాత్రాన అక్రమంగా ముందుకు వెళ్లొద్దని న్యాయస్థానం హైడ్రాకు సూచించింది. ఇల్లు కూల్చే ముందు యజమానికి అవకాశం ఏమైనా ఇచ్చారా? ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో అమాయక ప్రజలను ఇబ్బంది పెడతారా ? అని ఉన్నత న్యాయస్థానం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ప్రశ్నించింది. కోర్టు అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలని సూచించింది. కూల్చివేతకు యంత్రాలు, సిబ్బందిని కోరడంతో సమకూర్చామని రంగనాథ్ బదులివ్వగా.. చార్మినార్, హైకోర్టు కూల్చివేతకు తహసీల్దార్

2 లో




# దసరాలోపు నియామకాలు

- డీఎస్సీ–2024 ఫలితాలు విడుదల
- 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపిక చేశాం
- అక్టోబర్ 9న నియామక పత్రాలిస్తాం
- విద్యకు మా ప్రభుత్వంలో అధిక ప్రాధాన్యత
- త్వరలో గ్రూప్-1 ఫలితాలు విడుదల చేస్తాం
- సీఎం రేవంత్ మరో తీపికబురు

**వారధి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణలో డీఎస్సీ2024 ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మరో తీపికబురు వినిపించారు. దసరా పండగలోపు ఫైనల్ నియామకాలు పూర్తి చేస్తామని ప్రకటించారు. అక్టోబర్ 9న ఎల్బీ

2 లో

# దసరాకు మంత్రివర్గ విస్తరణ




- ఆరుగురిని వరించనున్న అదృష్టం
- ఇద్దరికి గతంలోనే ఏఐసీసీ హామీ
- ఢిల్లీ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి
- నేడు ఏఐసీసీ అగ్ర నేతలతో భేటీ
- అస్వస్థతకు గురైన ఏఐసీసీ చీఫ్ ఖర్గేకు పరామర్శ

3 లో



# వికృత చేష్టలు మానుకోండి..

- మహిళలను గౌరవించడం మన బాధ్యత
- కొండా సురేఖపై సోషల్ మీడియాలో ట్రోలింగ్స్
- సంచలన ట్వీట్ చేసిన హరీష్ రావు

2 లో

# సిద్ధరామయ్యపై ఈడీ కేసు

- ముడా స్కామ్‌లో కర్ణాటక సీఎంకు బిగ్ షాక్
- లోకాయుక్త ఎఫ్ఐఆర్ ఆధారంగా విచారణ

2 లో




# రేవంత్‌కు అధికారం నెత్తికెక్కింది

- కేసీఆర్‌కు పదేళ్లు పడితే రేవంత్‌కు 3 నెలలు పట్టలేదు
- మోసానికి మారు పేరు సీఎం
- రాహుల్ గాంధీని సైతం బురిడీ కొట్టించాడు
- రైతు రుణమాఫీ వివరాలు పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలి
- ఢిల్లీలో కప్పం కట్టేందుకే హైడ్రా పేరుతో వసూళ్లు
- రైతు హామీల సాధన దీక్షలో ఈటల, ఏలేటి, డీకే అరుణ

**వారధి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి అధికారం తలకెక్కిందని ఘాటుగా విమర్శించారు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్. మాజీ సీఎం కేసీఆర్‌కు ఆరేళ్లు పడితే, రేవంత్‌కు మూడు నెలలు కూడా పట్టలేదన్నారు. మోసానికి మారు పేరు రేవంత్ అంటూ తీవ్ర విమర్శలు చేశారు. రాహుల్‌గాంధీని సైతం బురిడీ కొట్టించిన ఘనత రేవంత్‌రెడ్డి అన్నారు. రేవంత్ మోసపు మాటలను నమ్మి ప్రజలు ఓట్లేశారని అన్నారు. సోమవారం ఇందిరాపార్క్ వద్ద బీజేపీ రైతు హామీల సాధన దీక్ష

2 లో

# పశువుల కంటే హీనంగా ప్రవర్తిస్తారా..?

## సోషల్ మీడియాలో నాపై తప్పుడు పోస్టులు పెడతారా..

- డబ్బులిచ్చి మరీ ట్రోల్ చేయిస్తున్నారు
- మీ ఇళ్లల్లో ఆడవాళ్లు ఉండరా
- మీ చెల్లి, తల్లికి ఫొటోలు చూపించండి
- కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పు
- లేదంటే బట్టలూడదీసి కొట్టిస్తాం
- మంత్రి కొండా సురేఖ కంటతడి



2 లో

# కబ్జాల్లో బీఆర్ఎస్ నెం.1

- చెరువులను కబ్జా చేసింది ఆ పార్టీ నేతలే
- మూసీ పరిధిలో ఇప్పటిదాకా ఒక్క ఇల్లు కూల్చలేదు
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



2 లో



## తిరుమల లడ్డూ కల్తీ చేసినట్లు
# సాక్ష్యం ఉందా..?

- రాజకీయాలు, మతాన్ని కలిపి చూడొద్దు..
- విచారణకు ముందే ఎందుకు ప్రకటించారు
- లడ్డూ వివాదంపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

**వారధి న్యూస్, న్యూఢిల్లీ:**
రాజకీయాలకు, మతానికి మధ్య ఉండాల్సిన దూరాన్ని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. మతం, రాజకీయాన్ని కలిపి చూడొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తిరుమల లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు చేసిన

2 లో

# ప్రజలు తిరగబడితే..
# మంత్రులు రోడ్లపై తిరగలేరు

- పేదల ఇళ్లు కూలుస్తుంటే చూస్తూ ఊరుకోం
- కూల్చాల్సి వస్తే మొదట హైడ్రా కార్యాలయాన్నే కూల్చాలి
- మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు ఎందుకు..?
- ఆరు గ్యారెంటీలు ఎప్పుడు అమలు చేస్తారు
- రేవంత్ అన్‌ఫిట్ సీఎం
- సర్కారుపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

**వారధి, స్టేట్‌బ్యూరో:**
"వందరోజుల్లోనే హామీలన్నీ నెరవేరుస్తామని పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. వందరోజుల్లో చేస్తామన్న పనులను 300 రోజులు దాటినా చేయడం లేదు. ఇప్పటి వరకు ఒక్క గ్యారంటీ కూడా అమలు చేయలేదు. మూసీ పరివాహక ప్రజల పాలిట సీఎం రేవంత్ రెడ్డి కాలయముడిగా మారారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే మాకు పట్టాలు వచ్చాయని ప్రజలు చెప్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసినప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకు చెప్తున్నారని పేదలు అడుగుతున్నారు." అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు .ఈ సందర్భంగా



2 లో



# పశువుల కంటే హీనంగా ప్రవర్తిస్తారా..?

**వారధి, స్టేట్ బ్యూరో:**
సోషల్ మీడియాలో తనపై అసభ్యకర పోస్టులు పెట్టి.. కొందరు పశువుల కంటే హీనంగా ప్రవర్తిస్తున్నారని మంత్రి కొండా సురేఖ కంటతడి పెట్టారు. సోమవారం గాంధీ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. ఒక మహిళనైన తన పట్ల అసభ్యంగా చాలా ఇబ్బందికరమైన పోస్టులు పెట్టారని.. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తాను ఉన్న ఫోటోలను పెట్టి సోషల్ మీడియాలో అవమానకరమైన కామెంట్లు పెడుతున్నారని మంత్రి కొండా సురేఖ కన్నీటి పర్యంతమయ్యారు. ఇది బీఆర్ఎస్ సోషల్ మీడియా నిర్వాహకుల పనేనని తెలిపారు. డబ్బులిచ్చి మహిళలను అవమానకరంగా ట్రోల్ చేయడం ఏంటని నిలదీశారు. ఈ పోస్టు చూసినప్పటి నుంచి తాను అన్నం తినలేదని, నిద్రపోలేదని.. మానసిక ఆందోళనకు గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఇన్‌చార్జి మంత్రిగా మెదక్ జిల్లాకు వెళ్లానని, ఎంపీ రఘునందన్ చేనేత సమస్యలపై చెప్పి గౌరవంగా చేనేత మాలను తన మెడలో వేశారని అన్నారు. చేనేత మాల చేసేప్పుడు దాన్ని పరీక్షగా చూశానని తెలిపారు. చేనేత వృత్తుల వారికి సంబంధించిన గౌరవప్రదమైన నూలు అది అని అన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా వాళ్లు ఆ ఫొటోను పెట్టి.. వీళ్లకు షాదీ ముబారక్ ఎవరు ఇచ్చారు? అంటూ అసభ్యకర రీతిలో ట్రోల్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కేటీఆర్ ఖబడ్దార్.. కేసీఆర్ ఖబడ్దార్' అని మండిపడ్డారు. ఈ పోస్టు పెట్టిన వారికి అక్క, చెల్లి, తల్లి ఉంటారని గుర్తుంచుకోవాలన్నారు. ఈ ట్రోలింగ్ వీడియోలను మీ చెల్లికి, తల్లికి చూపించు కేటీఆర్ అని కొండా సురేఖ మండిపడ్డారు. ఇకపై ట్రోలింగ్ చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అధికారం పోయిందని బీఆర్ఎస్ వాళ్లు ఇష్టారీతిన పోస్టులు పెడుతున్నారని విమర్శించారు. ఈ ఫొటోకు సంబంధించి తాము సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇది అటవిక ప్రవర్తన అని విరుచుకుపడ్డారు. కేటీఆర్ క్షమాపణ చెప్పాలని లేదంటే బట్టలిప్పి ఉరికిస్తామని హెచ్చరించారు. పదేళ్లు దోచుకున్న బలుపు ఇంకా తగ్గలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వికృత చేష్టలు మానుకోండి..

- మహిళలను గౌరవించడం మన బాధ్యత
- కొండా సురేఖపై సోషల్ మీడియాలో ట్రోలింగ్స్
- ఎక్స్‌లో సంచలన ట్వీట్ చేసిన హరీష్ రావు



**వారధి, స్టేట్ బ్యూరో:**
మంత్రి కొండా సురేఖపై జరిగిన ట్రోలింగ్‌లను మాజీ మంత్రి హరీష్ రావు ఖండించారు. సోమవారం ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. మహిళలను గౌరవించడం మనందరి బాధ్యతగా చెప్పిన ఆయన.. వారి పట్ల అగౌరవంగా ప్రవర్తించడాన్ని ఏ ఒక్కరూ సహించరని తెల్చిచెప్పారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ అయినా, వ్యక్తిగతంగా తానైనా ఉపేక్షించబోమని స్పష్టంచేశారు. అదే విధంగా ఎక్స్ లో మంత్రి కొండా సురేఖ గారికి కలిగిన అసౌకర్యానికి మీతో పాటు నేనూ చింతిస్తున్నట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా జరిగే ఇలాంటి వికృత చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో అందురు కూడా.. బాధ్యతగా వ్యవహరించాలని అందరిని కోరుతున్నట్లు మాజీ మంత్రి హరీష్ రావు ట్వీట్ చేశారు. మరోవైపు కొండా సురేఖపై ట్రోలింగ్‌లపై మంత్రి సీతక్కకూడా స్పందించారు. ఇది హేయమైన చర్యఅని అన్నారు.



# సిద్ధరామయ్యపై ఈడీ కేసు

- ముడా స్కామ్‌లో కర్ణాటక సీఎంకు బిగ్ షాక్
- లోకాయుక్త ఎఫ్ఐఆర్ ఆధారంగా విచారణ

**వారధి న్యూస్, బెంగళూరు:**
కర్ణాటకలోని ముడా కుంభకోణంలో సీఎం సిద్ధరామయ్య చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే లోకాయుక్త కేసు నమోదు చేయడం, విచారణకు హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న కర్ణాటక ముఖ్యమంత్రికి మరో బిగ్ షాక్ తగిలింది. కర్ణాటకలోకి సీబీఐ రావడాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడంతో ఈడీ రంగంలోకి దిగింది. మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీముడా భూముల వ్యవహారానికి సంబంధించి భారీగా డబ్బులు చేతులు మారాయని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగి.. సిద్ధరామయ్యపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది.
ముడా భూముల స్కామ్‌లో కర్ణాటక లోకాయుక్త నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ.. సిద్ధరామయ్య, సహా పలువురిపై కేసు పెట్టింది. ఇప్పటికే సెప్టెంబర్ 27వ తేదీన ముడా కుంభకోణం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన లోకాయుక్త.. ఏ1గా సీఎం సిద్ధరామయ్య పేరును, ఏ2గా ఆయన భార్య పార్వతి, ఏ3గా ఆయన బావమరిది మల్లికార్జున్ పేర్లను చేర్చింది. ఈ నేపథ్యంలోనే ఇటీవలె సిద్ధూ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. కర్ణాటక రాష్ట్ర పరిధిలో ఏ కేసులోనైనా విచారణ కోసం వచ్చేందుకు సీబీఐకి ప్రస్తుతం ఉన్న సాధారణ అనుమతిని రద్దు చేస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. కర్ణాటకలో సీబీఐ విచారణ జరిపే ప్రతి కేసునూ పరిశీలించాకే అనుమతివ్వాలని నిర్ణయించింది. సీబీఐ పక్షపాతిగా వ్యవహరిస్తోందని.. రాష్ట్రం అనుమతించిన చాలా కేసుల్లో సీబీఐ ఛార్జ్‌షీట్ కూడా తెరవలేదని పేర్కొంది. గాడి తప్పుతున్న సీబీఐని కంట్రోల్‌లో పెట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కర్ణాటక తెలిపింది. అయితే సీబీఐకి నో ఎంట్రీ చెప్పడానికి.. సీఎం సిద్ధరామయ్యపై నమోదైన ముడా కుంభకోణం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.
ముడా భూముల కేటాయింపు, స్కామ్‌కు సంబంధించి పలువురు ఫిర్యాదులు చేయడంతో కర్ణాటక లోకాయుక్త అధికారి నేతృత్వంలో దర్యాప్తు చేయాలని ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఈ క్రమంలోనే సీఎం సిద్ధరామయ్య సహా మరికొందరిపై లోకాయుక్త ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ముడా భూముల కేటాయింపుల్లో సీఎం సిద్ధరామయ్య కుటుంబసభ్యులు లబ్ధి పొందారని.. అందుకోసం ముఖ్యమంత్రి అధికారాన్ని దుర్వినియోగానికి పాల్పడినట్లు.. కొన్ని కీలక ఆధారాలతో సామాజిక కార్యకర్త టీజే అబ్రహం.. కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

# ప్రజలు తిరగబడితే.. మంత్రులు రోడ్లపై తిరగలేరు

**మొదటిపేజీ తరువాయి**
కేటీఆర్ మాట్లాడుతూ, ఇల్లు అనేది ప్రజలకు ఉద్వేగంతో కూడిన అనుబంధం అని కేటీఆర్ తెలిపారు. అన్ని అనుమతులు తీసుకుని కట్టుకున్న ఇళ్లను ఎలా కూల్చుతారని ప్రశ్నించారు. ప్రభుత్వమే గుర్తించిన ఇళ్లను ఎందుకు కూల్చుతున్నారని గట్టిగా అడిగారు. గతంలో 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ చెరువులకు హద్దులు ఎందుకు గుర్తించలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదన్నారు. ఈ ప్రభుత్వానికి ఏమైనా ప్రాధాన్యతలు ఉన్నాయా? కేవలం మూసీ పైనే రూ.1.50 లక్షల కోట్లు కేటాయిస్తారా? అని కేటీఆర్ పేర్కొన్నారు.


**బుద్ధభవన్ కూల్చుతారా**
2400 కిలోమీటర్లు ఉన్న గంగా నది కోసం కేవలం రూ.40 వేల కోట్లు కేటాయించారని కేటీఆర్ అడిగారు. కూల్చాల్సి వస్తే మొదట హైడ్రా కమిషనర్ కార్యాలయం కూల్చాలని సూచించారు. ఎఫ్‌టీఎల్‌లోనే నిర్మించిన బుద్ధభవన్‌ను కూడా కూల్చాలన్నారు. ఎఫ్‌టీఎల్‌లోనే నిర్మించిన జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం సైతం కూల్చేయాలన్నారు.

**బుల్డోజర్లకు అడ్డుగా బీఆర్ఎస్**
"కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం. మూసీ సుందరీకరణతో రాష్ట్రానికి ఎంత ఆదాయం తిరిగి వస్తుంది. రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తే ఎన్ని ఎకరాలకు నీరు అందుతుంది. ఎవరి కమీషన్ల కోసం మూసీ సుందరీకరణ అంటున్నారు. పింఛన్లను రూ.4 వేలకు ఇంకా ఎందుకు పెంచటం లేదు. ఇళ్లు కట్టిస్తామన్నారు కానీ కూల్చుతామని ఎన్నికల ముందు ఎందుకు చెప్పలేదు కదా. ప్రజలు తిరగబడితే మంత్రులు ఊళ్లల్లో కూడా తిరగలేరు. పేద ప్రజల ఇళ్లు కూల్చుతుంటే మేము చూస్తూ ఊరుకోం. ఇకపై బుల్డోజర్లకు అడ్డుగా బీఆర్ఎస్ నేతలు ఉంటారు" అని కేటీఆర్ తెలిపారు.

**రేవంత్‌రెడ్డి అన్‌ఫిట్ సీఎం**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధిలోని హైదర్‌గూడలో పర్యటించారు. మూసీ ప్రాజెక్టు బాధితులను పరామర్శించారు. అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1920 నుంచి 2020 వరకు మూసీలో ఎలాంటి సమస్య తలెత్తలేదన్నారు. 2020లో తొలిసారిగా భారీ వర్షం కురవడంతో ఇబ్బందులు వచ్చాయని గుర్తు చేశారు. అప్పుడు కూడా కేసీఆర్ ప్రజలకు ఇబ్బందులు పెట్టవద్దన్నారన్నారు. కానీ కాంగ్రెసోళ్లే పర్మిషన్ ఇచ్చి, వాళ్లే రిజిస్ట్రేషన్ చేసి, వాళ్లే ఇళ్లను కూలగొడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలో కుడి చేయి ఏం చేస్తుందో.. ఎడమ చేయికి తెలియటం లేదన్నారు. రేవంత్ రెడ్డి ఒక అన్ ఫిట్, అసమర్థ సీఎం అని.. ఇక్కడ మార్కింగ్ ఇచ్చిన బిల్డింగ్‌లకు సంబంధించి విలువ లెక్కిస్తే దాదాపు వెయ్యి కోట్ల వరకు ప్రజల ఆస్తి ఉంటుందన్నారు.



# అధికారులు చెబితే.. హైకోర్టును కూలుస్తారా..?



**తరువాయి భాగం**
యంత్రాలు, సిబ్బంది అడిగితే ఇస్తారా? అని న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**హైడ్రా జీవోపై స్టే విధిస్తాం..**
హైడ్రా తీరు మారకుంటే స్టే ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. ఖాళీ చేయనంత మాత్రాన అత్యవసరంగా కూల్చాల్సిన అవసరం ఏముందన్న హైకోర్టు.. రాజకీయ నేతలను, పై అధికారులను మెప్పించేందుకు చట్టవిరుద్ధంగా పని చేయొద్దని స్పష్టం చేసింది. చనిపోయే వ్యక్తిని కూడా చివరి కోరిక అడుగుతారు కదా? అని నిలదీసింది. ఆదివారం కూల్చివేతలు హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా? చట్ట వ్యతిరేకంగా పనిచేస్తే అధికారులు ఇంటికి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించింది. మూసీ పరీవాహక ప్రాంతంపై కూడా 20 లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలైనందున అరుదైన కేసుగా భావించి అధికారులను విచారణకు పిలిచామని హైకోర్టు వెల్లడించింది. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం హైడ్రాకు ఎన్నో విధులున్నా అవేమీ పట్టించుకోకుండా కూల్చివేతల పైనే ఎందుకు దృష్టి పెట్టారని ప్రశ్నించింది. చట్టానికి లోబడి వ్యవహరించకుంటే హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే ఇవ్వాల్సి వస్తుందని హైకోర్టు హెచ్చరించింది.

# కబ్జాల్లో బీఆర్ఎస్ నెం.1

**వారధి, స్టేట్ బ్యూరో:**
మూసీ పరివాహకంలో ఇప్పటివరకు ఏ ఒక్క పేదవాడి ఇల్లు కూల్చలేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. అరగంట వాన పడితే హైదరాబాద్ పరిస్థితి దారుణంగా అవుతోందన్న మహేశ్‌కుమార్, గత పదేళ్లలో 1500 చెరువులు కబ్జాకు గురయ్యాయని వెల్లడించారు. ఇందులో ఎక్కువ శాతం బీఆర్ఎస్ నేతలే ఆక్రమించుకున్నారన్న కాంగ్రెస్ నేత, దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఇప్పుడు వారి వైఖరి ఉందని మండిపడ్డారు.
పేద, మధ్య తరగతి కుటుంబాలకు అన్యాయం చేస్తున్నామని దుమ్మెత్తి పోస్తున్న గులాబీ నేతలు, అప్పట్లో రైతులకు బేడీలు వేసి తీసుకెళ్లలేదా? అని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన అన్ని పార్టీల అజెండాలో ఉందని వివరించారు. దేశంలోనే అత్యంత కలుషితమైనదిగా మూసీనదికి పేరు ఉందని, కేవలం ఇప్పటివరకు నదీ వ్యర్థాలు మాత్రమే తొలగించినట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నల్ల చట్టాలు తీసుకొచ్చి ఎంత మంది రైతులను పొట్టన పెట్టుకుందో అందరికీ తెలుసని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు గురించి ఎంపీ అర్వింద్ మాట్లాడాలని డిమాండ్ చేశారు.

**మూసీ ప్రక్షాళనతో కోట్లాది పెట్టుబడులు**
హైడ్రా టార్గెట్ భూ బకాసురులు మాత్రమేనన్న మహేశ్‌కుమార్ గౌడ్, దోషుల ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదని తేల్చిచెప్పారు. పేదలు నష్టపోతే నష్టపరిహారం ఇస్తామన్న ఆయన, మూసీ పరిసర ప్రాంతాల్లో ఒక్క గుడిసె కూడా తొలగించలేదని తెలిపారు. మూసీ ప్రక్షాళన జరగకపోతే రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు కూడా ప్రమాదం ఉందని, సోషల్ మీడియాలో పెయిడ్ ఆర్టిస్టుల ద్వారా విష ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తప్పుడు వార్తలతో విష ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పర్యావరణం గురించి పెట్టుబడిదారులు అడుగుతున్నారని, మూసీ ప్రక్షాళనతోనే కోట్లాది పెట్టుబడులు వస్తాయని టీపీసీసీ అధ్యక్షుడు తెలిపారు. వందల కోట్ల రూపాయలతో సోషల్ మీడియాతో తిమ్మిని బమ్మి చేపిస్తున్నారని, హైదరాబాద్ అభివృద్ధి అంటే జన్వాడ ఫాం హౌజ్ చుట్టూ ఉన్న అభివృద్ధేనా అని మహేశ్‌కుమార్ నిలదీశారు. ఓల్డ్ సిటీని కేసీఆర్ నిర్లక్ష్యం చేసారని, హైదరాబాద్ అభివృద్ధి అంటే కేటీఆర్, హరీశ్, కవిత ఫాం హౌజ్ చుట్టూ జరిగిన అభివృద్దేనా అంటూ ధ్వజమెత్తారు.

# తిరుమల లడ్డూ కల్తీ చేసినట్లు సాక్ష్యం ఉందా..?



**తరువాయి భాగం**
ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, బీజేపీ మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి సుప్రీంకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగానే సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కల్తీ నెయ్యిని లడ్డూ తయారీ కోసం వాడినట్లు సాక్ష్యం ఉందా అంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. ఏ అంశంలోనైనా అనుమానం ఉంటే సెకండ్ ఒపీనియన్ తీసుకుంటాం... ఇది కోట్ల మంది భక్తుల మనోభావాలతో కూడిన వ్యవహారంలో.. ఈ ఘటనలో నెయ్యిని మరోసారి టెస్టు చేసేందుకు ఇంకో ల్యాబ్ కి ఎందుకు పంపలేదని అడిగింది.

**విచారణకు ముందే ఎందుకు ప్రకటించారు..?**
అంతే కాకుండా, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకుండా... సిట్ ఏర్పాటు కాకముందే ఎందుకు ప్రకటన చేశారని మండిపడింది. "మీరు (ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు) రాజ్యాంగబద్ధమైన పదవిని నిర్వహిస్తున్నప్పుడు.. దేవుళ్లను రాజకీయాలకు దూరంగా ఉంచుతారని మేం ఆశిస్తున్నాం. మీరు ఇప్పటికే విచారణకు ఆదేశించినట్లయితే, మీడియాకు వెళ్లాల్సిన అవసరం ఏమిటి? జులైలో ల్యాబ్ రిపోర్టు వచ్చింది. మీ ప్రకటన సెప్టెంబర్ లో వచ్చింది. అంతేకాక నివేదిక స్పష్టంగా లేదు" అని కోర్టు వ్యాఖ్యానించింది. విచారణ జరగకముందే ఇలాంటి ప్రకటన చేయటం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని సుప్రీంకోర్టు మండిపడింది. సెప్టెంబర్ 18న సీఎం చేసిన ప్రకటనకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. టీటీడీ అధికారే స్వయంగా కల్తీ జరిగినట్టు తేలిన నెయ్యిని ఉపయోగించలేదని చెబుతున్నారని, ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని పేర్కొంది. అంతే కాదు ప్రస్తుత సిట్ దర్యాప్తు కొనసాగాలా లేక మరో దర్యాప్తు చేపట్టాలా అన్న అంశంపై సొలిసిటర్ జనరల్ అభిప్రాయం తీసుకుంటామని సుప్రీంకోర్టు తెలిపింది. సుదీర్ఘ విచారణ తర్వాత గురువారానికి వాయిదా వేసింది.

# రేవంత్‌కు అధికారం నెత్తికెక్కింది

**తరువాయి భాగం**
నిర్వహించింది. ఈ దీక్షలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ మొత్తం ఎంత చేసిందో పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలంటూ సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని తాను ఆనాడే చెప్పానన్నారు. నాడు కాంగ్రెస్ పార్టీ రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని మూసివేస్తే, 6300 కోట్లతో రీ ఓపెన్ చేసిన ఘనత మోడీది అ న్నారు.. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని.. లేకపోతే రేవంత్ రెడ్డి భరతం పడతామని ఈ వేదిక నుంచి హెచ్చరిక చేస్తున్నాం అని ఈటల తెలిపారు.

**ఢిల్లీకి డబ్బులు పంపేందుకే ఇదంతా..**
రేవంత్ రెడ్డి రెండింటి కోసమే ఇదంతా చేస్తున్నాడని ఈటల రాజేందర్ ఆరోపించారు. ఒకటి హైడ్రా బూచి చూపు బిల్డర్ల దగ్గర డబ్బులు వసూలు చేసి హైకమాండ్‌కు డబ్బులు పంపడానికి, రెండవది మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నర కోట్లలో వచ్చే కమీషన్ కోసం అని ఆరోపించారు. హైకోర్టు హైడ్రాపై స్పందించడం శుభదినమని ఈటల అన్నారు. హైకోర్టు తప్పు పట్టింది అధికారులను కాదని, రేవంత్‌రెడ్డినే తప్పుపట్టిందని వ్యాఖ్యానించారు. రోషం ఉంటే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై రోడ్ మ్యాప్ ప్రకటించాలని ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎంత రుణమాఫీ అయ్యిందో పబ్లిక్ పోర్టల్‌లో పెట్టాలన్నారు. రుణమాఫీ చేయకుంటే నీ భరతం పట్టుడు ఖాయమని రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. పేదల కన్నీళ్ళలో కాంగ్రెస్ కొట్టుకుపోతుంది బీ కేర్ ఫుల్ అని అన్నారు. కేసీఆర్ కూడా అలవికాని హామీ ఇచ్చి, అడ్రస్ లేకుండా పోయారని ఈటల అన్నారు. కేసీఆర్ ను ఓడించాలని ప్రజలు, విద్యార్థులు, ప్రజాస్వామిక వాదులు కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. ఆరు గ్యారంటీలలో ఒక్క ఉచిత బస్సు తప్ప ఏమీ అమలు కాలేదన్నారు. రూ.17,900 కోట్లు రుణమాఫీ చేశామని సిఎం కార్యాలయం ప్రకటించింది తప్ప ఎక్కడా లెక్కలు చెప్పలేదన్నారు. దమ్ముంటే ఎంత రుణమాఫీ అయ్యిందో లెక్కలతో సహా ప్రజా పోర్టల్ లో పెట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు అండగా ఉండేందుకే ఈ రోజు దీక్ష చేస్తున్నామన్నారు.

**కూల్చివేతలపై ఎవరితోనైనా చర్చించారా..?**
మిస్టర్ రేవంత్ రెడ్డి.. ఇంత పెద్ద నిర్ణయం తీసుకొనే ముందు ప్రజాప్రతినిధులను సంప్రదించావా ?, క్యాబినెట్ లో చర్చించావా ?, ఎమ్మెల్యేలకు చెప్పావా ? అని ఈటల అడిగారు. రేవంత్ ను చూస్తే ఇళ్లను కూల్చి పేదల ఉసురు పోసుకున్న సంజయ్ గాంధీ గుర్తుకు వచ్చాడని, ఆయన వారసుడు ఈయన అని వ్యాఖ్యానించారు. మేధావుల్లారా హైదరాబాద్ లో చెరువులు ఉపయోగపడడం లేదు.. ఆ మురికి నీళ్లు తీసి మంచి నీటితో నింపేందుకు పోరాడాలని ఈటల కోరారు. సూరారం చెరువు కింద ఎప్పుడో పట్టాలు ఇస్తే 600 మంది ఇల్లు కట్టుకుంటే... వాటిని కూలుస్తానని అంటున్నారన్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ...దమ్ముంటే రుణమాఫీ చెయ్యి, రైతుబంధు ఇవ్వు.దమ్ముంటే ఆరు గ్యారంటీలు అమలు చేయి..కానీ ఇలా పేదల ఉసురు పోసుకోవద్దు అని ఈటల రాజేందర్ హితవు పలికారు.

**1000 మంది రైతుల ఆత్మహత్య: ఏలేటి**
కాంగ్రెస్ అధికారంలో వచ్చాక వెయ్యి మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఉదయం 11 గంటల వరకు బీజేపీ ప్రజాప్రతినిధుల నిరసన దీక్ష కొనసాగనుంది. దీక్షకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఆ పార్టీ నాయకులు తరలి వచ్చి సంఘీభావం తెలిపారు.



# దసరాలోపు నియామకాలు

**తరువాయి భాగం**
స్టేడియంలో నియామక పత్రాలు అందిస్తామని చెప్పుకొచ్చారు. 11062 టీచర్ ఉద్యోగాల భర్తీకి విశేష కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలియజేశారు. 1:3 ప్రాతిపదికన ఫలితాలు విడుదల చేశామని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

**65 రోజుల్లో 11062 ఉద్యోగాలిస్తున్నాం..**
అయితే.. గత ప్రభుత్వం పదేళ్లలో ఒకే ఒకసారి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. పదేళ్లలో వాళ్లు చేపట్టిన ఉపాధ్యాయ నియామకాలు కేవలం 7,857 మాత్రమేనన్నారు. విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన గత ప్రభుత్వానికి లేదని.. తాము అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ మొదలు పెట్టామన్నారు. విద్యకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. నిర్వహణ నుంచి నియామకాల వరకు 65 రోజుల్లో 11062 ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తున్నామని వివరించారు. ఇది విద్యపై తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని రేవంత్ రెడ్డి తెలిపారు.

**విద్యే మా ప్రభుత్వ ప్రాధాన్యం**
తెలంగాణలో పేదలకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్నదే తమ ఆకాంక్ష అని రేవంత్ రెడ్డి తెలిపారు. అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాల నియామక పత్రాలు అందించామన్నారు. నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని టెట్ నిర్వహణ తర్వాతే డీఎస్సీ నిర్వహించామన్నారు. టీజీపీస్సీని ప్రక్షాళన చేశామని సీఎం తెలిపారు. త్వరలోనే గ్రూప్1 ఫలితాలు ప్రకటించి తెలంగాణ పునర్నిర్మాణంలో వారిని కూడా భాగస్వామ్యం చేస్తామన్నారు.

**మొదటి ఏడాదిలో 60వేల ఉద్యోగాలు**
మొదటి ఏడాదిలోనే 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. టీచర్ ఉద్యోగం కేవలం ఒక ఉద్యోగం కాదు.. అది భావోద్వేగమని అభివర్ణించారు. గత పదేళ్లలో విద్య నిర్లక్ష్యానికి గురైందన్నారు. తాము వచ్చాక విద్య శాఖకు నిధుల కేటాయింపు పెంచామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. గత ప్రభుత్వం స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించలేదని.. అందుకే తమ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తోందన్నారు.

**25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్..**
100 నియోజకవర్గాల్లో 20 నుంచి 25ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్ మధిరలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం టీచర్ల పదోన్నతులు, బదిలీలు చేపట్టలేదన్నారు. తమ ప్రభుత్వం వివాదాలకు తావు లేకుండా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసిందని తెలిపారు.

**కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారు..**
కొన్ని రాజకీయ పార్టీల మీడియాలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై మాపై దుష్ప్రచారం చేస్తున్నాయన్న సీఎం రేవంత్ రెడ్డి.. పదేళ్లు ప్రభుత్వంలో ఉన్నవాళ్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని, అందుకే ఈ ఉపద్రవం వచ్చిందన్నారు. వాటన్నింటిని పరిష్కరించుకుంటూ తాము ముందుకెళుతున్నామన్నారు. విద్యపై పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి అని తాము భావిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. విద్యార్థుల సంఖ్యతో ప్రమేయం లేకుండా ప్రభుత్వ పాఠశాలలు నిర్వహిస్తామన్నారు. పేదలకు విద్య అందించడమే తమ విధానమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

## బతుకమ్మ, దసరా పండగల
# నేపథ్యంలో ప్రత్యేక రవాణా సేవలు

**వారధి న్యూస్, వనపర్తి:** బతుకమ్మ మరియు దసరా పండగల సందర్భంగా, ప్రజలకు రవాణా సంబంధిత ఇబ్బందులు లేకుండా చేయడానికి, ఈ నెల 1 నుండి 11 వరకు ప్రతి రోజూ 10 ప్రత్యేక బస్సులు ఎంజీబీఎస్ నుండి వనపర్తికి నడిపించబడనున్నాయి. ఈ ప్రకటన డిపో మేనేజర్ వేణుగోపాల్ వారు చేశారు.ఈ ప్రత్యేక బస్సులు పండుగల సమయంలో ప్రజలకు సులభమైన, సమయానికి, సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా ఉంటాయని ఆయన తెలిపారు.అదనంగా, వివాహాది శుభ కార్యాల కోసం, వివాహ విహారయాత్రలకు కూడా సురక్షితమైన మరియు సుఖవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు ఆర్టీసీ బస్సులు నడిపించబడతాయి. ఈ బస్సులకు అతి తక్కువ అద్దెతో, ప్రతి బుకింగ్ పై 10% రాయితీ కూడా అందించబడుతుంది.ప్రయాణికులు ఈ ప్రత్యేక సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్టీసీ అభివృద్ధిలో సహకరించాలని డిపో మేనేజర్ వేణుగోపాల్ కోరారు.




# ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాలి

- వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పేర్కొన్నారు. సోమవారం వనపర్తి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి, ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 12 ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల యొక్క ఎస్ఐ, సిఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని బట్టి పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించు కోవలని సూచించారు. భార్యాభర్తల ఫిర్యాదులు 02 ,పరస్పర గొడవలు 03 ,భూ తగాదాలు 07 పిర్యాదులు వచ్చాయని తెలిపారు.



# సిటీ హోటల్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** వనపర్తి పట్టణ కేంద్రంలోని కొత్తకోటలో నూతనంగా సిటీ హోటల్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ పుట్టపాక మహేష్. సోమవారంఎం ఏ ఖయ్యూం, మహమ్మద్ హమీద్ ల ఆహ్వానం మేరకు హోటల్ ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ క్వాలిటీతో కూడిన పదార్థాలను వినియోగదారులకు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్స్ విభూతి నారాయణ ,చీర్ల సత్యం సాగర్, జంపన్న ,నక్క రాములు ,చంద్రకళ ,ఎల్ఐసి కృష్ణ ,మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు ,టిపిసిసి వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్ ,ఓబీసీ పట్టణ అధ్యక్షులు బొంబాయి మన్నెంకొండ ,ఏ ఆర్ గౌడ్ ,ఆరిఫ్ ,ఇర్ఫాన్ ,ఎండి ఫజల్ ,అస్లాం కాంగ్రెస్ పార్టీ నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.




# తల్లి బిడ్డల సంరక్షణ కోసం యాప్ పై శిక్షణ

- జిల్లా మాతా శిశు సంరక్షణ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఝాన్సీ రాణి

**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** జిల్లాలోని వైద్యాధికారులు, ఏఎన్ఎం ల కొరకు ప్రవేశ పెట్టిన అమ్మ కోసం యాప్ పై జిల్లా మాతా శిశు సంరక్షణ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఝాన్సీ రాణి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే ఏఎన్ఎం లందరికీ ఈ శిక్షణలో గర్భవతులలో ప్రమాదకర పరిస్థితులను త్వరితగతిన గుర్తించడం, చికిత్స అందించడం, తద్వారా శిశు మాతృ మరణాలను అరికట్టడం , తల్లి బిడ్డల సంరక్షణ కొరకు ఈ యాప్ ను ప్రత్యేకంగా రూపొందించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో ప్రమాదకర లక్షణాలున్న గర్భవతులను గుర్తించి ఇందులో నమోదు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మంజుల జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్, డాక్టర్ శ్రీ హరినాథ్ రెడ్డి, డాక్టర్ నదియా సాదత్ , నర్సింగరావు ఎంసిఎచ్ సూపర్వైజర్, జిల్లా డాటా మేనేజర్ వెంకటకృష్ణారెడ్డి, పరశురాం డాటా ఎంట్రీ ఆపరేటర్ , మిగతా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పాల్గొనడం జరిగింది.

## లారీ ఢీకొట్టడంతో టు వీలర్ పై
# ప్రయాణిస్తున్న ముగ్గురు దుర్మరణం

**వారధి న్యూస్, చిలుకూరు:** చిలుకూరు మండలంలోని మిట్స్ కాలేజ్ వద్ద సోమవారం రాత్రి జరిగిన దారుణ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం ప్రకారం, మృతులు వేములపల్లి మండలానికి చెందినవారుగా గుర్తించారు. వారు మిర్యాలగూడ నుండి కోదాడకు టు వీలర్ పై ప్రయాణిస్తున్న సమయంలో లారీ వేగంగా ఢీకొట్టడంతో ఈ ఘోరం జరిగింది.ప్రమాదం తక్షణమే వారి ప్రాణాలు తీసింది. ఈ విషాదకర ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.







# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన అచ్చంపేట మార్కెట్ కమిటీ నూతన చైర్మన్

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** అచ్చంపేట నియోజకవర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్గా ఎన్నికైన అంతటి రజిత మల్లేష్ వైస్ చైర్మన్ వెంకటయ్యలు సోమవారం సీఎం రేవంత్ రెడ్డి స్వగృహంలో కలిశారు ఈ సందర్భంగా చైర్మన్గా వైస్ చైర్మన్గా అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి పుష్ప గుచ్ఛి కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యం చేయకుండా వారి సంక్షేమం కోసం నిరంతరం పాటు పడాలని సూచించారు.

**సీఎం రేవంత్ రెడ్డి ని కలిసిన జిల్లా గ్రంథాలయ నూతన చైర్మన్ గంగాపురం రాజేందర్**

నాగర్ కర్నూలు జిల్లా గ్రంథాలయ నూతన చైర్మన్ గా నియామకమైన అచ్చంపేట సీనియర్ న్యాయవాది గంగాపురం రాజేందర్ సోమవారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ని ఆయన స్వగృహంలో కలిశారు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చిన రేవంత్ రెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా నియామకం చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తగిన న్యాయం చేస్తుందని అన్నారు పదవులను పొందిన నాయకులు ప్రజాసేవలో తరించాలని ఆయన వారిని ఆదేశించారు.

**సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మద్దిమడుగు దేవాలయ చైర్మన్ రాములు నాయక్**

నల్లమల్ల ప్రాంతంలో వెలసిన ప్రసిద్ధి చెందిన శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయం నూతన పాలకమండలి చైర్మన్గా ఎన్నికైన రాములు నాయక్ సోమవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



# జిల్లా ఆడిట్ అధికారి వీర భద్ర రావు కి ఘన వీడ్కోలు

**వారధి న్యూస్, వికారాబాద్:** జిల్లా ఆడిట్ అధికారి వి. వీర భద్ర రావు పదవీ విరమణ పొందడంతో, ఆయనను జిల్లాకలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం కలెక్టరేట్ సమావేశ హాలులో శాలువాతో సత్కరించారు. కలెక్టర్ ప్రసంగిస్తూ, బాధ్యతాయుతంగా ప్రభుత్వ ఉద్యోగం నిర్వహించడం జీవితంలో ఎంతో సంతృప్తి ని కలిగించనుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్ డి ఓ వాసు చంద్ర తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. 34 సంవత్సరాల సుదీర్ఘ సేవలను ముగించుకున్న వీర భద్ర రావును, ఆయా ప్రాజెక్టుల్లో చేసిన కృషికి అధికారులు అభినందించారు.



# మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి

- ఐజీ సత్యనారాయణ ఆదేశాలు

**వారధి న్యూస్, వికారాబాద్:** మల్టీజోన్ 2 ఐజీ సత్యనారాయణ మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించాలనుకుంటున్నారు. ఆయన చెప్పారు, "మాదక ద్రవ్యాల వినియోగంపై పోలీసులు ఉక్కుపాదం మోపాలి. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు."సోమవారం వికారాబాద్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఐజీ, ఎస్పీ నారాయణ రెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా, నమోదు అయిన కేసులు మరియు పెండింగ్ ఫైల్స్ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఐజీ మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్ర గౌరవ డిజీపి జితేందర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసులు ప్రజలకు నచ్చే విధంగా పనిచేయాలి. ఇసుక, పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించిన వారికి కఠిన చర్యలు తీసుకోవాలి" అన్నారు.అలవాటు ప్రకారం, అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు రికార్డ్స్ నమోదు చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో పీఎన్‌డీ విధానాలను బాగా అమలు చేయాలనీ, ఫార్మ్ హౌస్‌లు, రిసార్ట్స్‌ల వద్ద సీసీ టీవీ ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు.మరోవైపు, మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలకు సంబంధించిన కేసులపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసేందుకు పోలీస్ అధికారులపై ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కే నారాయణ రెడ్డి, అదనపు ఎస్పీ యు.రవీందర్ రెడ్డి, డిఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, పోలీసులు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత

- జిల్లా స్థాయి సమీక్షలో మంత్రి జూపల్లి
- ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలుపై దిశానిర్దేశం
- పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు

**వారధి న్యూస్, నిజామాబాద్ :** విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ పనితీరులో స్పష్టమైన మార్పు తీసుకురావాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నిజామాబాద్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, వివిధ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా వ్యాప్తంగా అమలవుతున్న పథకాల ప్రగతిని వివరించారు. 71,000 రైతులకు రుణమాఫీ పూర్తయిందని, కొంతమందికి సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ నెరవేరలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రుణమాఫీని అర్హులైన ప్రతి రైతుకు అందించాలని మంత్రి జూపల్లి అధికారులను ఆదేశించారు.

**విద్యా రంగంపై దృష్టి**

ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా బోధన జరగాలని, తరగతి గదులు, నీటి వసతులు, టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రవేశాలు పెంచాలని, విద్యార్థులకు ఆంగ్ల, తెలుగు దినపత్రికలు, డిక్షనరీలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**వైద్య రంగంలో మార్పులు**

వైద్య సేవలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంపొందించేందుకు అధికారులకు దిశానిర్దేశం ఇచ్చారు.



# దసరాకు మంత్రివర్గ విస్తరణ

- ఆరుగురిని వరించనున్న అదృష్టం
- ఇద్దరికి గతంలోనే ఏఐసీసీ హామీ
- నాలుగు జిల్లాల నేతలకు చాన్స్
- ఢిల్లీ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి
- నేడు ఏఐసీసీ అగ్ర నేతలతో భేటీ
- అస్వస్థతకు గురైన ఏఐసీసీ చీఫ్ ఖర్గేకు పరామర్శ

**వారధి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీ (Delhi)కి బయల్దేరారు. సోమవారం రాత్రి 8.30 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఆయన ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఇటీవల జమ్ముకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురైన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంగళవారం పరామర్శించనున్నారు. ఆ తర్వాత ఢిల్లీలోని పార్టీ ముఖ్యనేతలతో సమావేశం కానున్నారు.

**నామినేటెడ్ పదవులపైనా చర్చ..**

అలాగే రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై కాంగ్రెస్ అధిష్టానం పెద్దలతో చర్చించనున్నారు. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీపై మాట్లాడనున్నారు. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీలో టీపీసీసీ కార్యవర్గం పైన చర్చించనున్నారు. మంత్రివర్గ విస్తరణలో ఈసారి ఎవరికి అవకాశం దక్కుతుందో అని నేతల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటివరకు మంత్రివర్గంలో చోటు దక్కని నాలుగు జిల్లాల నేతలకు చోటు లభించనున్నట్లు తెలుస్తోంది. దసరాలోపు మంత్రి వర్గాన్ని చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి చూస్తున్నారని సమాచారం. అంతే కాకుండా హైడ్రా, మూసీ ప్రక్షాళన తదితర అంశాలపై ప్రతిపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు ఎదురవుతున్న నేపథ్యంలో, ఈ నిర్ణయం తీసుకోవడం వెనక ఉన్న కారణాలను ఆయన అధిష్ఠానానికి వివరించే అవకాశం ఉంది.

**మంత్రి వర్గ విస్తరణ**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సుమారు పది నెలలు అవుతుంది. ఇంకా పూర్తి స్థాయి మంత్రివర్గ విస్తరణ కాలేదు. గత నాలుగు నెలలుగా మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని పెద్ద ఎత్తున ప్రచారం జరగుతుంది తప్పా..అది వాస్తవ రూపం దాల్చడం లేదు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కేబినెట్ విస్తరణ ఉంటుందని చాలా మంది అనుకున్నారు. కానీ పార్లమెంట్ ఎన్నికలు ముగిసి ఐదు నెలలు అవుతున్నా ..మంత్రి వర్గ విస్తరణ జరుగలేదు. నెలల కొద్ది సమయం గడుస్తున్నా మంత్రివర్గ విస్తరణలో మాత్రం స్పష్టత రావడం లేదు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లిన ప్రతి సారి ఇక తమకు మంత్రి పదవి ఖాయం అన్నట్లుగా నేతలు తెగ ఫీలవుతున్నారు. మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా అన్న సమాచారాన్ని అనుయాయుల ద్వారా తెలుసుకుంటున్నారట. ఇలా రేవంత్ ఢిల్లీ వెళ్లిన ప్రతి సారి మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న నేతల పరిస్థితి ఇలానే ఉంటుందని సమాచారం. సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లడం , మంత్రి పదవి వస్తుందని నేతలు జిల్లాలో హడావుడి చేయడం పరిపాటిగా మారింది తప్ప మంత్రి వర్గ విస్తరణ మాత్రం జరగడం లేదు.

**ఢిల్లీలో నేతల లాబీయింగ్**

ఇటీవల తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ పేరును కాంగ్రెస్ అధిష్టానం అధికారికంగా ప్రకటించారు. దీంతో నేతల్లో మరోసారి ఆశలు చిగురెత్తాయి. పీసీసీ అధ్యక్షుడిని ప్రకటించారంటే త్వరలో కేబినెట్ విస్తరణ కూడా ఉంటుందని నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక తమకు మంత్రి పదవి ఖాయం అని కలలు కంటున్నారు. ఈ సారి దసరాలోపు కేబినెట్ విస్తరణ ఉంటుందని తాజాగా కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. దీంతో నేతలు మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధపడుతున్నారు.

# ఉపాధి హామీ కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించాలి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**వారధి న్యూస్, వనపర్తి:** ఉపాధి హామీ కూలీలకు 202526 సంవత్సరంలో అత్యధిక పనిదినాలు కల్పించేందుకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్ సోమవారం అధికారులకు ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో, జిల్లా గ్రామీణ అభివృద్ధి, జిల్లా పరిషత్, మరియు మండల అభివృద్ధి అధికారులు, ఏపీఓలు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం 202526 సంవత్సరానికి పనుల ఎంపికపై ప్రణాళిక రూపొందించడం, గ్రామ సభల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గంగ్వార్ అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో డీఆర్‌డీఓ ఉమాదేవి, జెడ్పి సీఈవో యాదయ్య, అదనపు డీఆర్‌డీఓ రామ మహేశ్వర్ రెడ్డి, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈవోలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.






## దేశ భవిష్యత్తు కాపాడే బాధ్యత ప్రతి పౌరుడు ది

- ప్రతి పౌరుడు బాధ్యతగా మెలగాలి

**వారధి న్యూస్, హైదరాబాద్ :** పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఐ డి హెచ్ కాలనీలో సికింద్రాబాద్ మండల్ రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు బన్సీలాల్ పేట్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గజ్జల శ్రీనివాస్, యూత్ వింగ్ అధ్యక్షుడు కొత్తూరు వెంకటేష్ సారధ్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎల్. వెంకటేశం మాట్లాడుతూ దళితులు కుటుంబాలు నివాసముంటున్న ప్రాంతంలో ఆధిపత్య వర్గాలకు చెందిన వారు ఎవరైనా అక్రమాలకు పాలు పడితే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా గాంధీ నగర్ పోలీస్ స్టేషన్ ఎస్సై నయీమ్ మాట్లాడుతూ చట్టాలపై పూర్తి అవగాహన ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని ప్రతి పౌరుడికి చట్టాలపై పూర్తి అవగాహన కలిగి విద్యావంతులై ఉండాలి, ప్రతి పౌరుడు దేశం పట్ల అంకితభావంతో దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులే అన్న నినాదాన్ని మహనీయులు ఇచ్చిన స్ఫూర్తిని గుర్తు చేసుకోవాలని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారతదేశాన్ని కాపాడవలసిన బాధ్యత పౌరులుగా ప్రతి ఒక్కరి పై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు

## గ్రామాలలో పడకేసిన పరిశుభ్రత

- పరిశుభ్రతపై దృష్టి సారించండి.
- సీజన్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టండి.

**వారధి న్యూస్, షాద్ నగర్:** గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ వినియోగించుకోకపోవడంతో పరిశుభ్రత విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఈ సమస్యలు ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఇలాంటి పరిస్థితుల వల్ల నీటి మార్గాలు కలుషితమవటం, దోమలు, ఇతర హానికరమైన కీటకాలు పెరగటం, వ్యాధులు విస్తరించటం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. షాద్ నగర్ వ్యాప్తంగా పలు గ్రామాలలో పరిశుభ్రత లోపించింది. అసలే సీజన్ వ్యాధుల బారిన పడుతూ ఆసుపత్రి పాలవుతున్నారు. ఇలాంటి పరిస్థితులు ఎదురవడటానికి ప్రధాన కారణాలు 1,ప్రభుత్వ పర్యవేక్షణ లోపించడంతో అధికారులు తరచుగా పరిశుభ్రత పట్ల తగిన దృష్టి పెట్టలేకపోతున్నారు.2,సాధనాల కొరతతో బ్లీచింగ్ పౌడర్, ఫెనాయిల్ వంటి పరిశుభ్రతకు అవసరమైన వనరుల సరఫరాలో లోపం ఉండటం.3,సహకారం లోపించడంతో గ్రామస్థులు పరిశుభ్రత విషయంలో అవగాహన లేకపోవడం లేదా తగిన రీతిలో చర్యలు తీసుకోకపోవడం వల్ల తీవ్రంగా నష్ట పోతున్నారని పలువులు మేధావులు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

**ఇది పరిష్కరించేందుకు మార్గాలు**

**గ్రామ పంచాయతీలు పరిశుభ్రతపై నిరంతర చర్యలు తీసుకోవాలి.**

**ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి.**

**బ్లీచింగ్ పౌడర్ వంటి పరిశుభ్రతా సామగ్రి అందుబాటులో ఉంచాలి.**

**తరచూ డ్రెయినేజీ శుభ్రం చేయడం, చెత్తను సక్రమంగా నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలి.** ఈ చర్యలు తీసుకుంటే గ్రామాల్లో పరిశుభ్రత పెరుగుతుంది, ప్రజారోగ్యం మెరుగుపడుతుందని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేశారు.




## చిన్నారి రుద్రాన్ష్ ను ఆశీర్వాదించిన యువ నాయకులు ఇమ్మానుయేల్ రాజ్..

**వారధి న్యూస్, లింగాల గణపురం :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం లోని లింగాలగనపూర్ మండలం వడిచర్ల గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు కనుగంటి సందీప్ కుమారుడు రుద్రాన్ష్ మొదటి జన్మదిన వేడుకల్లో పాల్గొని ఆశీర్వాదించిన స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరా కుమారుడు సింగపురం ఇమ్మానుయేల్ రాజ్ ఈ కార్యక్రమంలో నియోజకవర్గముఖ్య నాయకులు, మండల ముఖ్య నాయకులు, నాయకులు, మహిళా నాయకులు, యువకులు పాల్గొన్నారు




## డిపిఆర్ ఆమోదంపై బండ శ్రీశైలం నినాదం

**వారధి న్యూస్, చండూరు:** సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం, డిండి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన డిపిఆర్ (డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) ను ఆమోదించాలని ప్రభుత్వంపై అభ్యర్థన చేసారు. ఆయన మర్రిగూడ మండల పరిధిలోని శివన్నగూడెం గ్రామంలో నిర్వహించిన సిపిఎం శాఖ మహాసభలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సభ మైల సత్తయ్య అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా, బండ శ్రీశైలం మాట్లాడుతూ, మునుగోడు, దేవరకొండ ప్రాంతాలలో చేపట్టిన ప్రాజెక్టులలో కొన్ని నిర్మాణ పనులు జరుగుతున్నా, ఇంకా పర్యావరణ, అటవీ శాఖ అనుమతులు ఇవ్వడం మరియు పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేయడానికి అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించాల్సిన అవసరం ఉందని చెప్పారు.గతంలో జీవో ఎంఎస్ నెంబర్ 107 ద్వారా పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ఈ ప్రాంతానికి 0.5 టీఎంసీ నీరు ఇవ్వాలని జీవో జారీ అయిందని ఆయన వివరించారు. అలాగే, నల్లగొండ జిల్లాలో మూడు లక్షల 41 వేల ఎకరాలకు నీరు అందించేందుకు ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తెలిపారు. అయితే, డిపిఆర్ ఆమోదం పొందకపోవడం వల్ల డిండి ఎత్తిపోతల పథకంలో ప్రగతి స్తంభించిందని ఆయన చెప్పుకొచ్చారు. రిజర్వాయర్ నుండి మరో 27 కిలోమీటర్ల కాలువ తవ్వే పనికి కూడా అనుమతులు ఇవ్వడంలో ఇబ్బందులు వస్తున్నాయని గుర్తు చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, ఇంతవరకు ఈ అంశంపై సమగ్రమైన చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. మర్రిగూడ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టుల పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు త్రాగునీరు మరియు సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మర్రిగూడ మండల కార్యదర్శి ఎర్పుల యాదయ్య, కొట్టం యాదయ్య, చెల్లం ముత్యాలు, గడగోటి వెంకటేష్, రుద్రాక్షి శ్రీరాములు, పిట్టల రమేష్, చొప్పరి హనుమంతు, గిరి విష్ణు, సురిగి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ జామ్ రద్దీని ఎలా తగ్గించాలి అంశంపై అవగాహన

- బేగంపేట టిటిఐ ఎసిపి జి. శంకర్రాజు



**వారధి న్యూస్, హైదరాబాద్:** హైదరాబాద్ కమీషనర్ సి.వి. ఆనంద్ మరియు ట్రాఫిక్ అడిషనల్ సి.పి శ్రీ. విశ్వ ప్రసాద్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఎసిపి జి శంకర్ రాజు టి.టి.ఐ. గోషామహల్ నందు రిజర్వ్ సబ్ఇన్స్పెక్టర్ల కు ట్రాఫిక్ జామ్, రద్దీని ఎలా తగ్గించాలి, ట్రాఫిక్ విద్యకు ప్రాధాన్యత అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనము క్రమశిక్షణ కలిగిన డిపార్ట్మెంట్లో వున్నాం కాబట్టి ముందుగా మనం తప్పకుండ ట్రాఫిక్ నియమాలు పాటించాలి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత, అందుకు రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. పోలీస్ అధికారిగా సమాజానికి ఎల్లప్పుడూ అందుబాటులో వుంటూ ప్రజలకు అవసరం అయిన సహాయం చేస్తుండాలిని తెలిపారు . వాహనాల సంఖ్య రహదారి లేదా కూడలి సామర్థ్యాన్ని మించి ఉన్నప్పుడు, ట్రాఫిక్ జామ్లు ఏర్పడతాయి. నిర్మాణ ప్రాజెక్టులు ట్రాఫిక్ జామ్లకు కారణమవుతాయి. చిన్న ప్రాజెక్టలకు డ్రైవర్లు వేగాన్ని తగ్గించి, మరొక లేన్లో విలీనం చేయాల్సి ఉంటుంది. పెద్ద ప్రాజెక్టులకు వాహనాలను మరొక మార్గంలో మళ్లించాల్సి ఉంటుంది అన్నారు . ట్రాఫిక్ జామ్లు వలన సమయం, పెట్రోల్, ఇతర వనరులు నష్టపోతాయి. అనేక సందర్భాల్లో, ట్రాఫిక్ జామ్ సమస్యలను పరిష్కరించడానికి అనువైన మార్గం ప్రభావిత ప్రాంతంలో కారు ప్రయాణ డిమాండ్ని తగ్గించడం, పబ్లిక్ ట్రాన్సిట్ లేదా సైక్లింగ్ వంటి ఇతర పద్ధతుల వినియోగాన్ని పెంచడం ద్వారా ట్రాఫిక్ జామ్ నివారించవచ్చు . పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి పబ్లిక్ ట్రాన్సిట్ అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి అని తెలియజేసినారు.ఈ కార్యక్రమములో 58 మంది పోలీస్ సబ్ - ఇన్స్పెక్టర్లు టి.టి.ఐ. గోషామహల్ ఇన్స్పెక్టర్ .హరీష్, హెడ్ కానిస్టేబుల్ . వేణు గోపాల్, అబ్దుల్ మాజిద్ హెచ్. జి. అధికారి టిటిఐ బేగంపేట , హీరో మోటోకార్ప్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ సాదిక్ సాగర్ పాల్గొన్నారు.



## చెక్ డ్యామ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**వారధి న్యూస్, మహబూబ్ నగర్ :** కౌకుంట్ల మండలంలోని ముచింతల గ్రామం వద్ద నెల్లికొండి ముచ్చింతల గ్రామాల మధ్య కొత్తగా నిర్మించినటువంటి ఊక చెట్టు వాగు లో 15 కోట్ల 29 లక్షలతో నిర్మించిన చెక్ డ్యాము ను సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, అరవింద్ కుమార్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## పబ్లిక్ రిలేషన్స్ పాత్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల విజయానికి కీలకం

- జిల్లా కలెక్టరు హనుమంత్

**వారధి న్యూస్, భువనగిరి:** రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంలో పబ్లిక్ రిలేషన్స్ (పీఆర్) పాత్ర చాలా ముఖ్యం అని జిల్లా కలెక్టరు హనుమంత్ కే.జండగే అన్నారు. సోమవారం జిల్లా గజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా పౌర సంబంధాల అధికారి పి. వెంకటేశ్వరరావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి జిల్లా కలెక్టరు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ అభివృద్ధి పథకాలు మరియు సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించడంలో పబ్లిక్ రిలేషన్స్ చాలా కీలకమని, వాటి ప్రాముఖ్యతను ప్రజలకు అర్థం చేసే బాధ్యతను పౌర సంబంధాల అధికారి పి. వెంకటేశ్వరరావు విరివిగా నిర్వహించారని చెప్పారు. ఈ కార్యక్రమాలు విజయవంతంగా అమలు కావడానికి పబ్లిక్ రిలేషన్స్ వహించే పాత్రను ఆయన అభినందించారు.అభివృద్ధి కార్యక్రమాల అమలులో, ఉద్యోగులు క్షేత్రస్థాయిలో అద్భుతంగా పాత్ర పోషిస్తూ, జిల్లా అభివృద్ధిలో ముందంజలో నిలుస్తున్నారని కలెక్టరు హనుమంత్ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె. గంగాధర్, మీడియా ప్రతినిధులు, రాష్ట్ర గజిటెడ్ ఉద్యోగుల సంఘం ట్రెజరర్ మందడి ఉపేందర్ రెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా గజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జగన్మోహన్ ప్రసాద్, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## బి ఆర్ యస్ హయాంలో మంజూరైన పనులను ప్రారంభించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ కు వినతిపత్రం అందించిన బిఆర్ఎస్ జిల్లా నాయకులు

**వారధి న్యూస్, వనపర్తి:** వనపర్తి జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మంత్రిగా మంజూరు చేసిన పలు అభివృద్ధి పనులు చివరి దశలో ఉన్నాయి, మరికొన్ని పనులు ప్రారంభించలేదని, వాటిని వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతూ సోమవారం బిఆర్ఎస్ జిల్లా నాయకులు వినతిపత్రం అందించారు. ఈ వినతిపత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ కు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు గట్టు యాదవ్, పట్టణ అధ్యక్షుడు రమేష్ గౌడ్ మాట్లాడుతూ, "మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రిగా వనపర్తి నియోజకవర్గం నుండి గత ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను మంజూరు చేయించారు. వాటిలో కొంతమంది పనులు పూర్తయ్యాయి, మరికొన్ని చివరి దశలో ఉన్నాయి," అన్నారు. ముఖ్యంగా పట్టణానికి కీలకమైన బైపాస్ రోడ్డు, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అటవీశాఖ భూముల నుండి అనుమతులు పొందడం ద్వారా మంజూరి చేయించిన విషయం గుర్తుచేశారు. ఈ రోడ్డును త్వరగా ప్రారంభించాలని వారు కోరారు.పట్టణంలోని రోడ్ల విస్తరణ పనులు దాదాపు పూర్తి కాగా, ప్రభుత్వం మారిన తర్వాత ఆగిపోయిన పనులను కూడా వెంటనే ప్రారంభించాలని వినతిపత్రంలో సూచించారు. అలాగే, జిల్లా కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దగ్గర మౌలిక సదుపాయాలు లేక ప్రజలు పడుతున్న కష్టాలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.ఇతర అభివృద్ధి పనులు, టౌన్ హాల్, సమీకృత మార్కెట్, మారెమ్మ కుంటలో కూరగాయల మార్కెట్ వంటి ప్రాజెక్టులనూ ప్రారంభించాలని, వీటిని ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గట్టు యాదవ్, రమేష్ గౌడ్, విజయకుమార్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, నీల స్వామి, వేణుగోపాల్ నాయుడు, సయ్యద్ జమీల్, ఏ.కే. పాషా, లక్ష్మణ్ గౌడ్, శివప్రసాద్ గౌడ్, చిట్యాల రాము మరియు ఇతర బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.




## యువతలో సృజనాత్మకతను పెంపొందించాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పిలుపు

**వారధి న్యూస్, నారాయణ పేట:** యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. జాతీయ యువజన ఫెస్టివల్‌లో భాగంగా, సోమవారం జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఎస్.ఆర్ గార్డెన్ లో ఈ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించబడింది.జిల్లా కలెక్టరు, మెజిస్ట్రేట్ మరియు జిల్లా స్పోర్ట్స్ చైర్‌పర్సన్ సిక్తా పట్నాయక్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలించి, ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జాతీయ యువజన ఫెస్టివల్ ప్రతి సంవత్సరం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించబడే ఒక ప్రత్యేక పండుగ అని, దీనితో యువతను ప్రోత్సహించేందుకు కేంద్ర యువజన వ్యవహారాల మరియు క్రీడా మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు.ఈ ఉత్సవం యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే కాక, సాంస్కృతిక ఆవిష్కరణలు మరియు క్రీడా పోటీలను ప్రోత్సహించడమని పేర్కొన్నారు. ఫెస్టివల్ ద్వారా యువతలో జాతీయ భావం, సామరస్యం మరియు సృజనాత్మకతను పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా ఉందని చెప్పారు.సాంస్కృతిక విభాగంలో చిన్నారుల భరతనాట్య ప్రదర్శనను చూసిన కలెక్టరు, వాటిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ ఫెస్టివల్‌లో, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి, రాష్ట్ర స్థాయికి, జాతీయ స్థాయికి పంపించడం జరుగుతుందని, వివిధ సంస్కృతిక కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, కిడ్స్ పోటీలు, సైన్స్ మేళా నిర్వహించడం జరిగిందని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారి ఘనీ మాట్లాడుతూ, యువత మంచి మార్గంలో నడిచి దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ ఫెస్టివల్ లో గ్రూపు ఫోక్ సాంగ్ విభాగంలో కోస్గి మండలం ముశ్రీఫా జడ్పిహెచ్ఎస్ విద్యార్థులు మొదటి స్థానం సాధించారు. సోలో ఫోక్ సాంగ్ విభాగంలో దత్తు స్ఫూర్తి డిగ్రీ కాలేజ్ విద్యార్థి విజేతగా నిలిచారు. సైన్స్ మేళాలో దామరగిద్ద జడ్పిహెచ్ఎస్ విద్యార్థులు మొదటి స్థానం పొందారు. విజేతలకు బహుమతులు అందజేసి, పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ. అబ్దుల్ ఘనీ, జిల్లా సైన్స్ ఫెయిర్ అధికారి భాను ప్రకాశ్, పి.ఆర్.టి.యు జిల్లా అధ్యక్షులు యాదగిరి జనార్ధన్ రెడ్డి, పల్లె వెంకట్ రెడ్డి, మరియు జిల్లా పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.





## బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి. లక్ష్మినారాయణ

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** గొప్ప మానవతావాది, అరుదైన అధికారి, పేదలకు సేవలందించడానికి నిరంతరం తపనపడే మానవతా మూర్తి ఆయన లక్ష్మీనారాయణ. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోఎన్నో చోట్లల్లో వివిధ హోదాల్లో పనిచేసి శభాష్ సార్ అనిపించుకుని ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన లక్ష్మీనారాయణ మళ్లీ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు సేవలందించడానికి రావడం పట్ల ప్రజల్లోసంతోషం వ్యక్తం అవుతోంది.జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా వి. లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్ కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన కలెక్టర్ బి.యం. సంతోష్ ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంతకుముందు జిహెచ్ఎంసి, హైదరాబాదులో ల్యాండ్ అక్విజేషన్ విభాగంలో పనిచేసి జిల్లాకు అదనపు కలెక్టర్ గా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం అదనపు కలెక్టర్ గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాసరావు యథావిధిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ అక్విజేషన్ గా బాధ్యతలు నిర్వహిస్తారు. కలెక్టరేట్ ఏ.ఓ. వీరభద్రప్ప కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలుకుతూ, శుభాకాంక్షలు తెలియజేశారు.



## డెంగ్యూ ఫీవర్ పై అవగాహన కార్యక్రమం

**వారధి న్యూస్ , మహబూబ్ నగర్:** ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాల మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో డెంగ్యూ జ్వరాలు పెరుగుతున్న దృష్ట్యా మైక్రోబయాలజీ విభాగం సిబ్బంది మరియు స్టూడెంట్స్ డెంగ్యూ జ్వరం పై పకడ్బందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా ప్రయోజనాల కోసం ఇలాంటి కార్యక్రమాల ఆవశ్యకతను ప్రోగ్రాం చైర్మన్ ప్రొ.వి.రాజేంద్రప్రసాద్ హైలైట్ చేశారు. కార్యక్రమంలో మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ జె. శ్రీదేవి డెంగ్యూ జ్వరాన్ని అరికట్టడానికి అవేర్‌నెస్ ప్రోగ్రామ్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు పోస్టర్లు ప్రదర్శించి వివరించారు.రోగ కారకాల గురించి, వైరస్ లను వ్యాప్తి చేయడంలో దోమల పాత్ర, సంకేతాలు మరియు రోగనిర్ధారణ మరియు లక్షణాలు, ముఖ్యముగా దాని నివారణ చర్య గురించి, మన చుట్టూ ఉన్న పరిశుభ్రతను కాపాడుకోవడం ఎంత ముఖ్యమో, ముఖ్యంగా చెత్తను శుభ్రపరచడం పై అవగాహన కల్పించారు. , వైస్ ప్రిన్సిపాల్ డా.వి. పద్మ అనురాధ, శ్రీమతి అమీనాబేగం, సిబ్బంది మరియు స్టూడెంట్స్ కార్యక్రమం లో ఉత్సాహాన్ని నింపారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
GENERAL NEWS
జనరల్ న్యూస్

# పాఠశాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు

**వారధి న్యూస్, కొల్లాపూర్:** కొల్లాపూర్ పట్టణ కేంద్రంలోని రాణి ఇందిరా దేవి పాఠశాల కోసం రాష్ట్ర ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నూతన పాఠశాలగా మరమ్మత్తు పనులు చేయడానికి నిధులు మంజూరు చేశారు. ఆదివారం, మంత్రి జూపల్లి పాఠశాలను సందర్శించి, జరుగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా, మంత్రి మాట్లాడుతూ, నియోజకవర్గంలో పాఠశాల అభివృద్ధి కోసం ఎంత నిధులైన కూడా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు ముడి పడి ఉన్నందున, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అభ్యసించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. మరియు విద్యార్థులు చదువులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉన్నత స్థాయిలకు చేరుకోవాలని, రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామంటూ ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు మరియు ఇతరులు పాల్గొన్నారు.



# దేవీ నవరాత్రి ఉత్సవాల పై నార్త్ జోన్ డిసిపి సమీక్ష

- **డీజే లకు అనుమతి లేదు**
- **నార్త్ జోన్ డిసిపి రష్మీ పెరుమాళ్**

**వారధి న్యూస్, హైదరాబాద్ :** దసరా పండుగ సందర్భంగా నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులు, దాండియా నిర్వాహకులతో బోయిన్పల్లి క్లాసిక్ గార్డెన్ లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైనా నార్త్ జోన్ డిసిపి రష్మి పేరుమాళ్ మాట్లాడుతూ మండప ఏర్పాట్లు, విగ్రహ ప్రతిష్టాపన, నిమజ్జన ఊరేగింపు , ప్రత్యేకంగా ఫంక్షన్ హాల్ లో డీజే శబ్దాలు, టపాకాసులు కాల్చడంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.



# ముగిసిన ఐఎఫ్ డబ్ల్యూజే సమావేశాలు

- **దేశవ్యాప్త జర్నలిస్టుల సమస్యలపై చర్చ**

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:**

ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) 77వ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ముగిసాయి. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని మథుర (బృందావన్)లో మూడు రోజుల పాటు జరిగిన ఈ సమావేశాలు సోమవారం ముగిసాయి. చివరి రోజు మొదటి సెషన్స్ లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర మంత్రి ధారాసింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రెండవ సెషన్ లో హిమాచలప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షులు కే. విక్రమ్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ఐఎఫ్ డబ్ల్యూ జే ప్రతినిధులు, ఆయా రాష్ట్రాల అనుబంధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ న్యూస్ పేపర్స్ అండ్ న్యూస్ ఏజెన్సీస్ ఎంప్లాయిస్ ఆర్గనైజేషన్ నాయకులు పాల్గొని దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సుదీర్ఘ చర్చ జరిపారు. ఈ సమావేశాలలో ఐఎఫ్ డబ్ల్యూజే సెక్రటరీ జనరల్ విపిన్ దులియా, కాన్ఫడరేషన్ అధ్యక్షుడు ఇందుకాంత్ దీక్షిత్, ప్రధాన కార్యదర్శి బలరాం యాదవ్, కార్యదర్శి పులిపలుపుల ఆనందం, మహిళా కార్యదర్శి శాంతకుమారి, నమ్రత భోరా, ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యులు,తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రతినిధి వర్గం గవర్నర్ కు, మంత్రికి శాలువ కప్పి టీడబ్ల్యూజే ఎఫ్ మెమొంటోను బహుకరించారు. ఈ సమావేశాల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, వల్లాల జగన్, వివేకానంద,రాజశేఖర్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు దూమర్ల భాస్కర్ , జిల్లా ప్రధాన కార్యదర్శి కాలూరి శ్రీను, బాలకృష్ణ, లక్ష్మణ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.



# చెక్ డ్యామ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**వారధి న్యూస్, మహబూబ్ నగర్ :**

కౌకుంట్ల మండలంలోని ముచింతల గ్రామం వద్ద నెల్లికొండి ముచ్చింతల గ్రామాల మధ్య కొత్తగా నిర్మించినటువంటి ఊక చెట్టు వాగు లో 15 కోట్ల 29 లక్షలతో నిర్మించిన చెక్ డ్యాము ను సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, అరవింద్ కుమార్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ డిగ్రీ కళాశాల లో ఫిజుల దోపిడీ అరికట్టాలి

- **ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని సుమా**




**వారధి న్యూస్, జనగామ :** జనగామ జిల్లా కేంద్రంలో ఉన్న పలు డిగ్రీ కళాశాలలు విద్యార్థుల నుండి అడ్మిషన్ మరియు పరీక్ష ఫీజులు అని అధిక ఫీజులు వసులు చేస్తున్నారు అని ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని సుమా అన్నారు.కాకతీయ యూనివర్సిటీ నిబంధనల ప్రకారం ఏ ఒక్క డిగ్రీ కళాశాలలో సరైన వసతులు లేవని మండిపడ్డారు. సిడిసి కాలేజ్ డెవల్మెంట్ కౌన్సిల్ బృందం ప్రతి సంవత్సరం కళాశాలలో పర్యటన చేసి సరైన వసతులు లేకుండా నిబంధనల ప్రకారం విరుద్ధంగా నడిస్తే చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిదంగా ప్రతి విద్యార్థికి 5000 ఆశ చూపి కళాశాల యాజమాన్యం మోసం చేస్తున్న యూనివర్సిటీ అధికారులు మౌనంగా ఎందుకు ఉంటున్నారు అని ప్రశ్నించారు. UGC యూనియన్ గ్రాంట్ కమిషన్ 1956 నిబంధనలు తుంగలో తొక్కి పీజులు వసులూ చేస్తున్నారు అని వెంటనే కాకతీయ యూనివర్సిటీ అధికారులు తనిఖీలు నిర్వహించలని, మొద్దు నిద్ర లేచి సమస్యలు పరిష్కారం చేసి చూపాలని లేనియెడల విద్యార్థులను సమీకరించి పోరాటం చేస్తామని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో SFI నాయకులు యాకన్నా రాథోడ్, అనూష, ఆర్యా, మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- **బి ఆర్ ఎస్**



**వారధి న్యూస్, పెబ్బేరు:** కాంగ్రెస్ పార్టీ రైతులకు అందించవలసినటువంటి రైతుబంధు మరియు రైతు రుణమాఫీ విషయంలో ఎన్నికల ముందు అమలు కానీ హామీలు ఇచ్చి నేడు రైతులను మోసం చేస్తున్నటువంటి అధికార పార్టీ వైఖరికి నిరసిస్తూ పెబ్బేరు సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలో పట్టణ మరియు మండల బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల, రైతుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి రైతుబంధు రైతులందరికీ ఇచ్చి కుటుంబాలు సంతోషంగా ఉండేటట్లు చేసిందని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం బడాబడా నాయకులకు కోమ్ముకాస్తూ పేద,మధ్య కుటుంబాలపై ఉక్కుపాదం మోపుతున్నారని రైతులకు అందించాల్సినటువంటి రైతుబంధు ఇప్పటివరకు అందించలేదని అలాగే ఏకకాలంలో రైతు రుణమాఫీ చేస్తామని అబద్ధపు హామీలు నమ్మబలికి నేడు రైతులను నట్టేట ముంచారని ఇటువంటి మోసపు నాయకులకు ప్రజలే సరైన బుద్ధి చెప్తారని అన్నారు బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న ఎల్లప్పుడు ముందుండి ప్రభుత్వాన్ని ప్రశ్నించి ప్రజలకు అందాల్సినటువంటి ప్రతి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చ విధంగా అహర్నిశలు కష్టపడతామని అన్నారు. ధర్నా అనంతరం తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాములు, కరుణ శ్రీ, కర్రెస్వామి, వెంకటేష్, చిన్న ఎల్లారెడ్డి, రమేష్, మధు, సాయినాథ్, వెంకటయ్య గౌడ్, వేణు పట్టణ, మండల బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# నిరుపేదల వైద్య ఖర్చులకు సహకారం

- **డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పై కలెక్టర్ కు లేఖ**
- **ఎమ్మెల్యే పద్మారావు గౌడ్**



**వారధి న్యూస్, హైదరాబాద్ :** సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో నిరుపేదలకు మంచి వైద్య సేవలను అందిస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. మైలరగడ్డ కు చెందిన పెద్దరాజు, దూద్ బావి కి చెందిన కావేరి చెందిన అనారోగ్యంతో సతమతమవుతోండగా, వారికి శస్త్ర చికిత్స నిమిత్తమై రూ.2.75 లక్షల మేరకు విలువ చేసే ఎల్.ఓ.సీ. పత్రాలను ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సమకూర్చి సోమవారం సితాఫలమండీ లోని తన కార్యాలయంలో అందించారు.

సాయి నగర్ డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణాన్ని పూర్తి చేయాలి లాలాపేట లోని సాయి నగర్ ప్రాంతంలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలని పద్మారావు గౌడ్ అధికారులకు సూచించారు. సోమవారం ఈ మేరకు ఓ లేఖను జిల్లా కలెక్టర్ కు ఆయన పంపారు. పనుల్లో జాప్యం వల్ల నిరుపేద లైన లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారని, పనులను త్వరగా పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలని సూచించారు. అదే విధంగా సాయినగర్ లో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ కాంప్లెక్స్ లో సివరేజి వ్యవస్థ, మంచి నీటి సరఫరా ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలనీ జలమండలి డీ.జీ.ఎం. సరితను పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా ఆదేశించారు. రైల్వే, రెవిన్యూ విభాగాల అధికారులతో సమన్వయము ఏర్పాటు చేసుకొని ఈ పనులను పూర్తి చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.




# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** స్వయం సహాయక మహిళా సంఘాలు ఆదాయం వచ్చే యూనిట్లపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు.

సోమవారం ఆమె ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా అధికారులతో నిర్వహించిన సమ్మిళిత సమావేశంలో వివిధ అంశాలపై ఆమె సమీక్షించారు. మంత్రులు ,పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు ,శాసనసభ్యులు సమస్యల పరిష్కారం పై అయా శాఖల అధికారులకు పంపించిన లేఖలు,ప్రతి పాదనలపై తక్షణ చర్యలు చేపట్టి తీసుకున్న చర్యలను సంబంధిత ప్రజా ప్రతినిధులకు తెలియజేయడమే కాకుండా , జిల్లా కలెక్టర్ కార్యాలయానికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు..ప్రజావాణి ఫిర్యాదులన్నింటిని వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ లో

ఉంచవద్దని, ఈ సోమవారం నుండి ప్రారంభించిన మండల ప్రజావాణి కార్యక్రమం నిరంతరం నిర్వహించాలని, ఫిర్యాదులను తక్షణం పరిష్కరించడం, లేదా పై స్థాయికి పంపించడం జరగాలని, ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు.అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని, అన్ని చోట్ల ఆరోగ్య మహిళ క్లినిక్ లు సక్రమంగా నడవాలని చెప్పారు. మండల స్థాయిలో వయోవృద్ధుల కమిటీలను ఏర్పాటు చేయాలని, వారికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా కమిటీలు చూడాలని అన్నారు. ఈ కమిటీలలో ఆర్డీవో ,డి ఎస్ పి,జిల్లా సంక్షేమ అధికారులు సభ్యులుగా ఉండాలన్నారు . గ్రామస్థాయిలో అంగన్వాడి కేంద్రాల్లో శానిటేషన్ తో పాటు ,లైట్లు, ఫ్యాన్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామస్థాయిలోని ప్రభుత్వ సంస్థలలో పారిశుధ్యం తో పాటు, వాటి సక్రమ నిర్వహణకు చర్యలు చేపట్టాలన్నారు.స్వయం సహాయక మహిళా సంఘాలు బ్యాంకుల అనుసంధానంతో మంజూరు చేసిన బ్యాంకు రుణాలతో ఎప్పటిలా చట్నీలు,తినుబండారాలు, టైలరింగ్ ,కుట్లు ,అల్లికల వంటి యూనిట్లు కాకుండా వారి కుటుంబాల జీవనోపాదులు పెంచే విధంగా, ఆదాయం వచ్చే యూనిట్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణికి (54)ఫిర్యాదులు వచ్చాయి

ఈ ఫిర్యాదులలో ఎప్పటిలాగే రెవెన్యూ, వ్యక్తిగత సమస్యలు, భూ సంబంధిత సమస్యలు, ఉద్యోగ,ఉపాధి అవకాశాలకు సంబంధించినవి వచ్చాయి. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ యస్. మోహన్ రావు, డిఆర్ఓ కే వి వి రవికుమార్, జెడ్పి సీఈవో వెంకటరెడ్డి, ఇతర జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.




# నేడు జాతీయ రక్త దినోత్సవం

- **నిరంతర రక్త దాత అశ్విని నవదీప్**
- **పది సార్లు రక్త దానం చేసిన వైద్య విద్యార్థి**
- **పలువురు ప్రముఖుల అభినందనలు**

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** వైద్య విద్యార్థిగా రక్త దాన ప్రాధాన్యత ను గుర్తించిన అశ్విని నవదీప్ నిరంతరం రక్తదానం చేస్తూ యువత కు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. పి ఆర్ టి యు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, జూనియర్ రెడ్ క్రాస్ సమన్వయ కర్త అశ్విని చంద్రశేఖర్ తనయుడు వైద్య విద్యార్థి అశ్విని నవదీప్ నీట్ 2020 లో ఉత్తమ ర్యాంక్ సాధించిన నాటి నుంచి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్త దానం మహా గొప్ప దానమని భావించి స్వచ్ఛందంగా రక్త దానం చేయడం ఆరంభించారు. తను ఒక్కరే రక్త దానం చేయడం కాకుండా రక్త దానంపై అవగాహన కల్పిస్తూ వందలాది మంది విద్యార్థులతో రక్త దానం చేయిస్తూ అందరి మన్ననలు అందు కోవడం అభి నంద నీయం.ప్రస్తుతం హనుమకొండ లోని కాకతీయ మెడికల్ కళాశాల లో యం బి బి ఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న అశ్విని నవదీప్ 2020 లో నీట్ లో ఉత్తమ ర్యాంక్ సాధించిన నాటి నుంచి ఇప్పటి వరకు వరుసగా పది సార్లు స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. రక్తదాన అవశ్యకత పై యువతకు అవగాహన కల్పించి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులు, యువకులతో భారీస్థాయిలో రక్త దానం చేయించారు. మహబూబ్ నగర్ , హనుమకొండ జిల్లాలో రక్త దాన శిబిరాలు నిర్వహించారు. ముఖ్యంగా గత జూన్ 14న జరిగిన ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా 400 మంది వైద్య విద్యార్థులతో రక్త దాన శిబిరం నిర్వహించి రికార్డు సృష్టించి అధికారుల మన్ననలు అందుకున్నారు. అంతే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో కూడా అవసరమైన వారికి రక్తం అందించడం లో నవదీప్ తన వంతు సహాయం అందిస్తూ అందరిచే శభాష్ అని పించు కుంటున్నారు. అనేక సార్లు రక్త దానం చేయడంతో పాటు పేద విద్యార్థులకు అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. చిన్న వయస్సులో పెద్ద ఆశయంతో ముందుకు సాగుతున్న నవదీప్ ను రాష్ట్ర మంత్రులు, జిల్లా కలెక్టర్లు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లు, రెడ్ క్రాస్ చైర్మన్ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు . కాగా జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవంగా సందర్భంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్త దానం చేయాలని వైద్య విద్యార్థి అశ్విని నవ దీప్ యువత కు పిలుపు నిచ్చారు.

# కబ్జాలపై ఉక్కు పాదం మోపండి

- **ప్రభుత్వ పాఠశాల దారి కి అడ్డంగా ప్రహరి గోడ**
- **సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ కు వినతి**
- **కాంపల్లి శ్రీనివాస్, సిపిఐ పార్టీ కార్యదర్శ**




**వారధి న్యూస్, హైదరాబాద్ :** సికింద్రాబాద్ లో అడ్డు అదుపు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతూ, కబ్జాలకు పాల్పడుతున్న వారి పైన ఉక్కు పాదం మోపాలని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిహెచ్ఎంసి లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో ఈ అక్రమ నిర్మాణంల పై జోనల్ కమిషనర్ కిరణ్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూనిబంధనలు తుంగలో తొక్కి అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను, కబ్జాలను కట్టడి చేసి అక్రమ దారుల పై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా దూద్ బాయ్ ప్రభుత్వ పాఠశాల దారి కి అడ్డంగా ప్రహరి గోడ నిర్మించి నిర్మించుకున్న షెడ్డును తొలగించి విద్యార్థులకు రహదారిని ఏర్పాటుకు కృషి చేయాలని జోనల్ కమిషనర్ ను కోరారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ అక్రమాలను ఉపేక్షించబోమని తక్షణమే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



# విద్యార్థుల విద్యపై ఉపాధ్యాయుల బడి నిద్ర

**వారధి న్యూస్, పెబ్బేరు:** మండలంలోని యాపర్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం గ్రామంలో సోమవారం బడినిద్ర కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పలుస శంకర్ గౌడ్,ఉపాధ్యాయులు మైనోద్దీన్, ఈశ్వర్ రెడ్డి , శ్రీధర్,వెంకటేశ్వర్లురాత్రి 7 గంటల నుంచి గ్రామంలోని విద్యార్థుల ఇళ్లను సందర్శించి విద్యార్థుల చదువు గురించి వివరించారు. పేరెంట్స్ మీటింగ్ నిర్వహించిన సమయంలో అందరు తల్లిదండ్రులు హాజరు కావలని కోరారు.ఇంటింటికీ వెల్లి తలిదండ్రులను కలసి మట్లాడటం జరిగిందని ప్రధానోపాధ్యాయుడు పలుస శంకర్గౌడ్ తెలిపారు. తల్లిదండ్రుల సమావేశంలో తల్లిదండ్రులు హాజరు కావటం లేదని,ఉపాధ్యాయుల అభిప్రా యం ప్రకారం బడి నిద్ర కార్యక్రమం చేద్దామని ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇంటి దగ్గర ఇంటి పని చేయించాలనీ తెలిపారు. సమ్మేటివ్ 1 పరీక్షలకు విద్యార్థులు బాగా చదవాలని,తల్లితండ్రులకు ఉన్న చెడ్డ అలవాట్లను పిల్లలు చేపట్టకూడదని, సిగరెట్ ,మందు లాంటివి తీసుకురామనడంపిల్లలకి చెప్పకూడదని చెప్పారు. విద్యార్థులకు సెపరేట్ స్టడీ కార్నర్ ఏర్పాటు చెయ్యాలని, సెల్ఫోన్ మరియు టీవీకి దూరంగా ఉంచాలని సూచించారు.తల్లిదండ్రులు పిల్లలతో కూడా గడపాలన్నారు. కార్యక్రమం చూసి తల్లిదండ్రులు చాలా సంతోష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు స్వరాజ్యం, బాబు రెడ్డి, పెద్దలు పాల్గొన్నారు.

# పీఎం విశ్వకర్మ యోజనను గ్రామాలలో వెంటనే అమలుపరచాలి

- **బిజెపి జిల్లా అధికార ప్రతినిధి& మండల ఇంచార్జ్ పెద్దిరాజు**



**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను గ్రామాలలో వెంటనే అమలుపరచాలని కోరుతూ ప్రజావాణిలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి& వనపర్తి మండల ఇంచార్జ్ పెద్దిరాజు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల రాకతో గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగైపోతున్న చేతివృత్తులు కమ్మరి, కుమ్మరి,ఎరుకలి,చాకలి,మంగలి, వడ్రంగి, దర్జీ,చేపల వేట,చెప్పులు కుట్టడం,మెకానిక్, వెల్డింగ్ తదితర 14 రకాల చేతివృత్తుల వారికి చేయూతనందించి ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన లో మండలంలో వందలాదిమంది దరఖాస్తులు చేసుకున్నారని గ్రామపంచాయతీలలో నోడల్ అధికారిగా దరఖాస్తులను పరిశీలించి మరియు ధ్రువీకరించాల్సిన పంచాయతీ కార్యదర్శులు విలేజ్ లాగిన్ ఓపెన్ కావడం లేదని లాగిన్ ఐడి, పాస్వర్డ్ అప్డేట్ కావడం లేదని, ఎంపీడీవో, డిపిఓ ఆఫీసులో లాగిన్ అప్డేట్ అవుతుందని చెబుతూ బిపిఎల్ కుటుంబాలకు చెందిన చేతి వృత్తుదారులు విశ్వకర్మ యోజనలో లబ్ధి పొందకుండా పంచాయతీ కార్యదర్శులు అడ్డుకుంటున్నారని జిల్లా కలెక్టర్ సదరు విషయమై తగు చర్యలు తీసుకుని గ్రామాలలో విశ్వకర్మ యోజనను వెంటనే అమలుపరిచే విధంగా ఆదేశాలు జారీ చేయాలని భారతీయ జనతా పార్టీ తరపున చిట్యాల గ్రామ విశ్వకర్మకు దరఖాస్తు చేసిన గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు.కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పోతు శ్రీనివాసులు,మండల ఉపాధ్యక్షులు కాటమోని శ్రీనివాస్ గౌడ్,విశ్వకర్మ దరఖాస్తుదారులు పోతు తిరుపతయ్య, కొక్కు మన్యం,వడ్డే వెంకటయ్య, పెద్ది శేఖర్,వాకిటి రాములు, మండ్ల రామకృష్ణ, కుమ్మరి వీరేష్,ఉదార్ల యాదగిరి, పెద్ది రమేష్, గొల్ల అంజి, మండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com



# కృతి సనన్ గ్లామర్ షో



బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకున్న అందాల భామ కృతి సనన్. ఈ అమ్మడు ఏడాదికి మూడు, నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకొస్తోంది. కృతి సనన్ నటించిన 'తేరీ బాతోన్ మే ఐసా ఉల్జా జియా', 'క్రూ' సినిమాలు ఈ ఏడాది థియేటర్స్ లోకి వచ్చాయి. వీటిలో 'క్రూ' సినిమా కమర్షియల్ సక్సెస్ అందుకుంది. ఫీమేల్ ఒరియాంటెడ్ కథాంశంతో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకొచ్చి ఆకట్టుకుంది. ఇదిలా ఉంటే 'దో పత్తి' అనే సినిమా నిర్మాణ దశలో ఉంది. ఈ సినిమాకి కృతి సనన్ ప్రొడ్యూసర్ గా కూడా వ్యవహరిస్తోంది. తెలుగులో సూపర్ స్టార్ మహేష్ బాబుకి జోడీగా '1:నేనొక్కడినే' సినిమాతో కృతి సనన్ నటిగా కెరియర్ స్టార్ట్ చేసింది. అయితే ఈ మూవీ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. 'హీరోపంతి' మూవీతో అమ్మడు బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి అక్కడి నుంచి బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లతో స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. కృతి సనన్ ఇన్ స్టాగ్రామ్ లో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా గ్లామర్ ఫోటోషూట్ లని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేస్తూ ఉంటుంది. వీటికి లక్షల్లో లైక్స్ వస్తాయి. రెగ్యులర్ గా డిఫరెంట్ అవుట్ ఫిట్ లతో కృతి సనన్ తన ఫాలోవర్స్ కి కలర్ ఫుల్ గా ఎట్రాక్ట్ చేస్తూ ఉంటుంది. నెటిజన్లు కూడా కృతి సనన్ గ్లామర్ ఫోటోలని వీక్షిస్తూ ఉంటారు. వాటిపై తమదైన శైలిలో కామెంట్స్ పెడుతూ కృతి సనన్ అందంపై ప్రశంసలు కురిపిస్తారు. తాజాగా ఈ బ్యూటీ బ్లాక్ కలర్ లాంగ్ ఫ్రాక్ లో అదిరిపోయే స్టన్నింగ్ ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో పంచుకుంది. ఈ ఫోటోలని ఏకంగా 4.43 లక్షల మంది ఇప్పటి వరకు లైక్ చేశారు. జలకన్య తరహాలో శరీరం మొత్తం కప్పేసిన ఈ అవుట్ ఫిట్ కృతి సనన్ అందానికి మరింత వన్నెలు అందిస్తోంది. ఒక్క నిమిషంలో జలకన్య అంటూ ఈ ఫోటోలకి కృతి సనన్ కామెంట్ మెన్షన్ చేసింది. ఫ్యాన్స్ నుంచి కృతి సనన్ అందానికి వావ్ అనే కామెంట్స్ వస్తున్నాయి.



# దేవర'తో హిస్టరీ క్రియేట్ చేసిన మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహించారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె నిర్మించిన ఈ మూవీ సెప్టెంబర్ 27న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ అయ్యింది. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో బాలీవుడ్ వెర్సటైల్ స్టార్ సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రలో నటించారు. భారీ అంచనాలతో విడుదలైన 'దేవర' చిత్రం బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున విడుదలైన ఈ చిత్రం తొలి రోజున రూ.172 కోట్ల వసూళ్లను సాధించింది. అదే స్పీడుని కొనసాగిస్తోంది. ఈ వారాంతం ముగిసే వరకు అంటే మూడు రోజుల్లోనే రూ.304 కోట్లు గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించటం విశేషం. ఇప్పటి వరకు వచ్చిన కలెక్షన్స్ చూస్తుంటే 80 శాతం రికవరీ అయ్యింది. తెలుగు రాష్ట్రాల్లో 'దేవర' మూవీ బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో రూ.87.69 షేర్ కలెక్షన్స్ సాధించింది. అలాగే హిందీలోనూ చక్కటి వసూళ్లు వస్తున్నాయి. నార్త్ బెల్ట్‌లో దేవర సినిమా కలెక్షన్స్ నెమ్మదిగా పెరుగుతూ వస్తున్నాయి. హ్యూజ్ ఎక్స్‌పెక్టేషన్స్‌తో ప్రారంభమైన ఈ సినిమా అదే జోరుని కొనసాగిస్తోంది. నాలుగో రోజు కూడా థియేటర్స్ అన్నీ హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో కొనసాగుతుండటం విశేషం.



# 'శ్వాగ్' ట్రైలర్ రిలీజ్

కంటెంట్ కింగ్ శ్రీవిష్ణు, ట్యాలెంటెడ్ డైరెక్టర్ హసిత్ గోలి 'రాజ రాజ చోర' బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత యూనిక్ ఎంటర్‌టైనర్ 'శ్వాగ్' తో అలరించడానికి రెడీ అయ్యారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మరో 4 రోజుల్లో సినిమా విడుదలకు సిద్ధమవుతుండగా, మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 1551 నుంచి మగవాడి ప్రయాణం అంటూ ట్రైలర్ ప్రారంభమవుతుంది. స్వాగనిక రాజవంశంలో ప్రతి రాజు మగ వారసుడిని కలిగి ఉండాలని కోరుకుంటాడు. అయితే, 1970ల నుండి ఈ వంశానికి చెందిన యయాతి సాదాసీదా జీవితాన్ని గడుపుతాడు. అతనికి కుమార్తెలు మాత్రమే వుంటారు. మరొక యుగానికి చెందిన భవభూతి, సింగ తన వారసుడిని తెలుసుకుంటాడు. రాజవంశం నిధిని అప్పగించడం అతని బాధ్యత. అయితే, వింజమర రాణి దిన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుంది. విభిన్న టైమ్‌లైన్‌లలో సెట్ చేయబడిన కథ, జెండర్ గేమ్స్ ని ట్రైలర్ చాలా ఆసక్తికరంగా ప్రజెంట్ చేసింది. దర్శకుడు హసిత్ గోలి ఈ ట్రైలర్ ద్వారా ప్లాట్‌ను క్లారిటీ, ఇన్ సైట్ తో అందించారు. శ్రీవిష్ణు 4 డిఫరెంట్ గెటప్‌లలో అద్భుతమైన నటన కనబరిచారు. భిన్నమైన బాడీ లాంగ్వేజ్, డిక్షన్, గెటప్ లతో అలరించారు. భవభూతి పాత్ర ఎక్స్ ట్రార్డినరీ గా వుంది.